

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సౌఖ్యజ్వాల

**"గీతా ఈ రాత్రికి** బయటకి వెళ్ళి తిందామా? మినర్వాకి వెళ్దాం తయారవు" ప్రశ్న తనే, జవాబూ తనే ఇచ్చిన ప్రమోద్‌ని చూసి తలాడించి అప్పటికే సగం తరిగిన కూరముక్కలని చూసింది గీత. నానపెట్టిన బియ్యం, చింతపండు, తరిగిన కూరగాయలు అన్నిటినీ ఫ్రిజ్‌లో సర్ది పావుగంటలో తయారై బయటకి వచ్చింది.

చూస్తున్న టీ.వి.ని ఆపేసి, కారు తాళం చెవులు తీసుకుని బయటకి నడిచాడు ప్రమోద్. ఇంటికి తాళం వేసి అతన్ని అనుసరించింది గీత. నిజానికి ఆమెకి అప్పుడు బయటకి వెళ్ళడం ఇష్టంలేదు. చాలా రోజులుగా ఎదురు చూస్తున్న ఓ పాత సినిమా ఆ రోజు టెలికాస్ట్ అవుతుందని అడ్వర్‌టైజ్‌మెంట్ చూసి, చకచక వంట, భోజనం ముగించి టీ.వి ముందు కూర్చుందాం అనుకుంది. ప్రమోద్ మాటకి ఎదురు చెపితే వీరభద్రుడు అవుతాడు. ఇక సినిమా చూసే మూడ్ ఎటూ మిగలదు. అందుకని నిరాసక్తంగా కారెక్కింది.

మెయిన్ రోడ్‌కి చేరుకున్న ఐదు నిమిషాల్లో వాళ్ళ కారు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంది. ప్రమోద్ మొహం కోపంతో ఎర్రబడింది.

"నీ మూలంగానే.! నీకు ఎప్పుడు చెప్పాను? ఎప్పుడు తయారయ్యావు? పదినిమిషాల ముందు తయారైతే ఇలా ట్రాఫిక్‌లో ఇరుక్కునే వాళ్ళం కాదు."

ఆ దూషణల వర్షంలో ఏం చేయాలో తెలియలేదు గీతకి.

"మీరు చెప్పిన పావుగంటలో వచ్చేసాను, అన్నీ ఫ్రిజ్‌లో సర్ది." గొణిగింది.

"నీకు ఎప్పుడు చెప్పానో నేనూ అప్పుడే రెడీ అవలేదా? ఐనా అవన్నీ అవతల పారెయ్యాల్సింది. లేదా ఇంటికి వచ్చాక పెట్టచ్చుగా? అంతా చాదస్తం..."

మారుమాట్లాడకుండా ఆ ఆవేశాన్ని భరించింది గీత. ట్రాఫిక్‌లో ఓ పావుగంట చిక్కుకుంటే వచ్చే నష్టం ఏమిటో ఆమెకి అర్థం కాలేదు. ఓ పావుగంట లేట్‌గా తింటారు. ఓ పావుగంట లేట్‌గా ఇంటికి చేరుకుంటారు. దీనికి అంత ఆవేశం అవసరమా అనుకుంది.

పది నిమిషాల్లో ట్రాఫిక్ క్లియరైంది.

హోటల్‌లో కూర్చున్నాక ప్రమోద్ అడిగాడు ఆప్యాయంగా.

"ఏం తింటావు?"

అప్పటికే మనసు పాడైన గీత మెల్లిగా చెప్పింది.

"మీ ఇష్టం."

"నా ఇష్టం ఏమిటి? ఇక్కడ బోలెడు ఛాయిస్ ఉన్నప్పుడు నీకు ఏం కావాలో అది తిను" అతని గొంతు పెరగడంతో కంగారుగా చూసింది.

అతనూ కొద్దిగా సంభాళించుకుని గొంతు తగ్గించి చెప్పాడు.

"నీకు సాఫ్ట్ వెజ్ నూడుల్స్ ఇష్టంకదా అది చెప్పనా?"

సరే అన్నట్లుగా తలూపింది గీత.

భోజనం చేస్తూ ఆ రోజు ఆఫీస్‌లో జరిగిన విశేషాలన్నీ ఆసక్తిగా చెప్పాడు ప్రమోద్. గీత కూడా ఆసక్తిగానే విన్నది.

తర్వాత ప్రేమగా అడిగాడు.

"నీకు కసాటా ఐస్ క్రీమ్ ఇష్టం కదా! తింటావా?"

గీత నవ్వుతూ తలూపింది.

"సాయంత్రం నేను వచ్చే టైంకి రెడీగా ఉండు. మా ఫ్రెండ్ పెళ్ళి రిసెప్షన్‌కి వెళ్ళాలి. శిల్పారామం చాలా దూరం కాబట్టి త్వరగా బయలుదేరాలి" ఆఫీస్‌కి వెళ్తూ చెప్పాడు ప్రమోద్.

"అలాగే"

ఆమె బుగ్గమీద ప్రేమగా "గుడ్‌గర్ల్" అంటూ చిటికె వేసి నవ్వాడు ప్రమోద్.

ఆ ప్రేమ వ్యక్తీకరణకి గీతకూడా పారవశ్యంతో కూడిన నవ్వు నవ్వింది.

సాయంత్రం ఐదున్నరకల్లా రెడీ అయి కూర్చుంది. ఆరుగంటలకి వచ్చిన ప్రమోద్ పచ్చని పట్టుచీరలో కుందనపు బొమ్మలా ఉన్న భార్యని చూసి మురిసిపోయి ఓ చిన్న ముద్దు పెట్టుకుని హడావిడిగా తయారయ్యాడు.

"ఇంక బయలుదేరదామా?" షర్ట్ గుండీ పెట్టుకుంటూ అడిగాడు.

"నేను రెడీ" తాళం చెవులు చేత్తో పట్టుకుని చెప్పింది గీత.

ఆమెని నిశితంగా చూసిన ప్రమోద్ మొహం కఠినంగా మారింది. అతలోని మార్పు చూసి ఆమె భయంగా ఓ అడుగు వెనక్కి వేసింది.

"ఎన్నిసార్లు చెప్పినా నీకు బుద్ధిరాదు. ఐదివేల రూపాయల చీర కట్టుకుంటావు కానీ ఏభై రూపాయల చెప్పులు వేసుకుంటావ్. ఎంత ఛీప్‌గా ఉంటుంది? మొన్న మెట్రోలో కొన్న చెప్పులు ఏమయ్యాయి?" కోపంగా అరిచాడు.

"అవి రెడ్ కలర్ కదా? ఎల్లో చీర కట్టుకుని.." గొణిగింది గీత.

"పద" కసిరినట్లు చెప్తూ బయటకి నడిచాడు.

కారు ఓ ప్రముఖ చెప్పుల షాపు దగ్గర ఆగింది.

"చాలా దూరం వెళ్ళాలి అన్నారు కదా? అక్కడ నా పాదాలు ఎవరు చూస్తారు? మరోసారి కొనుక్కుందాం పదండి వెన్యూకి వెళ్దాం" చెప్పింది.

"నోర్మూసుకుని దిగు" కారు తలుపుని సాధ్యమైనంత గట్టిగా వేస్తూ చెప్పాడు.

అవమానంతో వచ్చే కన్నీళ్ళని ఆపుకుంటూ షాపులోకి నడిచింది గీత.

"సిక్స్ నంబర్‌లో గోల్డ్‌కలర్ చెప్పులు చూపించండి" సేల్స్ గర్ల్‌కి చెప్పాడు ప్రమోద్. ఆమె చూపించిన ఐదారు రకాల్లో ఓ రకాన్ని ఎంపిక చేసి గీత వైపు తోసాడు. ఆమె వాటిని తొడుక్కోగానే చెప్పాడు ఆరాధనగా.

"అబ్బ! కరెక్ట్‌గా సరిపోయాయి. నీ పాదాలు సిండ్రెల్లా పాదాలు గీతా. చిన్నగా పల్చగా, నాజూగ్గా ఎంత అందంగా ఉన్నాయో!"

పాత చెప్పులని కార్టన్‌లో పెట్టివ్వమని చెప్పి, దాన్ని తీసుకుని బిల్ చెల్లించి బయటకి నడిచాడు.

వీరిని చూసిన పెళ్ళికొడుకు ముఖం చేటంత అయింది.

"ఒరేయ్ ప్రమోద్ నీకోసం చూస్తున్నాం. మన ఫ్రెండ్స్ అంతా వచ్చారు. నీకోసం అంతా వెయిటింగ్" ఎక్సయిటింగ్‌గా అరిచాడు.

ఒకే కాలేజీలో చదివిన ఆ మిత్రులంతా సుదీర్ఘ సంభాషణలో మునిగి పోయారు. 'ఎవరూ భార్యలతో రాలేదేమో' వంటరిగా విసిగిపోయిన గీత అనుకుంది. గీత అనే ఓ ప్రాణి తనతో ఉందన్న సంగతి కూడా మర్చిపోయి కబుర్లలో మునిగిపోయిన తన భర్తని చూస్తూ ఓ మూలగా కూర్చుంది. అరగంట తర్వాత ఇహలోకంలోకి వచ్చిన ప్రమోద్ గీత భుజం చుట్టూ చెయ్యివేసి తన స్నేహితుల దగ్గరకి తీసుకెళ్ళి చెప్పాడు.

"నా బెటర్ హాఫ్ గీత"

వాళ్ళంతా పెద్దగా 'హాయ్' చెప్పారు. గీత మౌనంగా నమస్కారం పెట్టింది.

"మేమంతా కబుర్లు చెప్పుకుంటూ తర్వాత తింటాం. గీతా నువ్వెళ్ళి భోజనం చేసెయ్యి" చెప్పాడు ప్రమోద్.

"నాకు ఎవరూ తెలీదు, ఆకలి కూడా లేదు. మీతోనే తింటాను" మెల్లిగా చెప్పింది.

"నా ఫ్రెండ్స్‌తో తింటాను అన్నాకదా.. ఫో వెళ్ళు తిను" గద్దించాడు ప్రమోద్.

అక్కడంతా ఓ నిమిషం నిశ్శబ్దం అలుముకుంది. అవమానంతో అక్కడినుంచి గబగబా వెళ్ళిపోయింది గీత.

దాదాపు గంటన్నర తర్వాత పాన్ నములుతూ వచ్చిన ప్రమోద్, రిసెప్షన్ హాల్‌లో ఒంటరిగా కూర్చున్న గీతని ఆప్యాయంగా పలకరించాడు.

"బోర్ కొట్టిందా డియర్. చాలాకాలం తర్వాత కలిసాం కదా. మా వాళ్ళు ఓ పట్టాన వదల్లేదు. భోజనం చేసావా?"

చేయలేదంటే మళ్ళీ ఏ ఉపన్యాసాలు వినాల్సి వస్తుందో అని గీత మౌనంగా తలూపింది.

"పద వెళ్దాం. పాపం నీకు విసుగుపుట్టి ఉంటుంది. నేనొక్కడినే వస్తే బావుండేది" బయటకి నడిచాడు ప్రమోద్.

అదేమాట తను అంటే ఎన్ని యుద్ధాలు జరిగేవో ఊహిస్తూ గీత అతన్ని అనుసరించింది.

హాస్పిటల్ గదిలోకి హడావిడిగా వచ్చాడు ప్రమోద్. ఒంటిమీద కట్లతో నీరసంగా పడుకుని ఉన్న గీత భయంగా అతన్ని చూసింది.

"బుద్ధుందా నీకు? నీకేమైనా కావాలంటే నాతో చెపితే తీసుకెళ్తాగా? ఆ పక్కింటి పిల్ల బైక్ మీద బయటికి ఎందుకెళ్ళావ్? ఆ పిల్ల ఎదురుగా మగ పదార్ధం కనబడగానే చున్నీ సర్దుకోవడమో, అద్దంలో మొహం చూసుకోవడమో చేస్తూంటుంది. ఇవాళ కూడా ఎదురుగా ఎవడ్నో చూసి ఆ రెండు పనులూ చేసి ఉంటుంది. దాంతో ఫుట్‌పాత్‌ని గుద్దింది" ఆవేశంగా అరిచాడు.

"ఊరుకోండి నాకేం పెద్ద దెబ్బలు తగల్లేదులే. పాపం ఆ పిల్లకి కూడా దెబ్బలు తగిలే ఉంటాయి." బలహీనంగా చెప్పింది.

"ఏం తగల్లేదు. గుండ్రాయిలాగా బానే ఉంది. కాళ్ళు అటూ ఇటూ వేసి కూర్చోవడంతో బండిమీదే ఉండిపోయింది. ఒకేవైపు కూర్చున్న నువ్వు ఎగిరి పేవ్‌మెంట్ మీద పడ్డావు. ఆ పిల్లే నాకు ఫోన్ చేసి 'అంకుల్ ఆంటీ పడిపోయారు' అని చెప్పింది."

ఆ తిట్ల వర్షానికి ఎదురు చెప్పలేక అతన్ని చూస్తూ ఉండిపోయింది. అకస్మాత్తుగా ప్రమోద్ ఆమె మంచం అంచున కూర్చుని వంగి కట్టుకట్టి ఉన్న ఆమె నుదుటిని సుతారంగా ముద్దు పెట్టుకుని గద్గదంగా అడిగాడు.

"నీకేమైనా అయితే నేనేమైపోతాను చెప్పు? ఆ పడటం పేవ్‌మెంట్ మీద కాక రోడ్డుమీదకి పడితే? ఊహించడానికే భయంగా ఉంది. చూడు ఎన్ని దెబ్బలో? ఎప్పటికి తగ్గేను? ఇంకెప్పుడూ ఇలాంటి అడ్వెంచర్స్ చేయకు. నా గురించి కూడా ఆలోచించు గీతా! నువ్వు లేని నేను జీరోనే" అతని కళ్ళవెంట టపటపా నీళ్ళు కారాయి.

హఠాత్తుగా తనకి వచ్చిన తలనొప్పి తనకి తగిలిన దెబ్బల వల్లో, లేక భర్త ప్రవర్తనవల్లో అర్థంకాని గీత బాధగా మూలిగింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

**Click here to share your comments on this story**